క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నమనేని ప్రకాష్‌రావు నేతృత్వంలో శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం నివాసంలో వివిధ పార్టీలకు చెందిన 50మంది యువకులు కాంగ్రెస్ పార్టీ చేరారు. కార్యక్రమంలో జున్ను రాజేందర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

జగిత్యాలటౌన్: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల పురాణిపేట అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గృహజ్యోతి సద్వినియోగం చేసుకోవాలి


మొగిలిపేటలో జీరో బిల్లు అందిస్తున్న నాయకులు, అధికారులు

మల్లాపూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని మొగిలిపేటలో శనివారం గృహజ్యోతి పథకాన్ని ట్రాన్స్‌కో అధికారులతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారుల ఇంట్లో మీటర్ రీడింగ్ తీసి వారికి జీరో బిల్లు అందజేశారు. పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం గృహజ్యోతి వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎల్ఎం తుమ్మనపల్లి విష్ణు, కాంగ్రెస్ నాయకులు ఏలేటి జలపతిరెడ్డి, ఎనడ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన

జగిత్యాలరూరల్: ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతున్నామని ఆటోడ్రైవర్లు శనివారం తిప్పన్నపేట బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలో ప్రయాణికులు ప్రయాణం చేయకపోవడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని, తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలి

కోరుట్ల రూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించే గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని గౌడ సంఘ నాయకులు అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ఆత్మీయ సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి గౌడ సోదరులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పడాల నారాయణ గౌడ్, ఉత్కమ్ వెంకట్ గౌడ్, కుంట నారాయణ, అయిలాపూర్ గౌడ సంఘ అధ్యక్షుడు పొడేటి ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గట్టు ఆంజనేయ స్వామి ఆలయ కార్యవర్గం

గొల్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ శ్రీ ముక్తేశ్వర స్వామి సహిత గట్టు ఆంజనేయ స్వామి దేవస్థాన నూతన కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా దావు తిరుపతి, ఉపాధ్యక్షుడిగా చింతపండు తిరుపతి, గౌరవఅధ్యక్షుడిగా గుడ్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా దావు జలపతి, కోశాధికారిగా బలిజపెల్లి తిరుపతి, సహాయ కోశాధికారిగా ఉప్పుల రాజేశ్, సలహాదారులుగా ఆకుల కొమురెల్లి, కొత్తపల్లి కిషన్, మాచర్ల మల్లయ్య, సభ్యులుగా బలిజపల్లి రాజన్న, దావు సత్తన్న, మేడవరం నాగభూషణం, తిప్పర్తి లక్ష్మీపతి,ఆశినేని కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఓబీసీ సామాజిక సమ్మేళనం

ధర్మపురి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ అన్నారు. పట్టణంలో శనివారం ఓబీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. కులవృత్తుల మీద ఆధారపడి జీవనం కొనసాగించే 18 కుల సంఘాల ఆధ్వర్యంలో ఈ సామాజిక సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కో-కన్వీనర్ బండారు లక్ష్మణ్, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల హారం.. బుగ్గారం

- 11 గ్రామాలతో మండలం ఏర్పాటు
- విద్య, వైద్య సదుపాయాల్లో పురోగతి కరువు
- శాశ్వత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- పూర్తికాని భగీరథ పనులు


బుగ్గారం మండల కేంద్రం ఏరియల్ వ్యూ

బుగ్గారం: పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతన జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ధర్మపురి, గొల్లపల్లి మండలాల్లోని 11 గ్రామాలను కలిపి బుగ్గారం మండలం ఏర్పాటైంది. దీంతో ప్రజలకు పరిపాలన పరంగా సత్వర సేవలు అందుతూ పలు ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వివిధ గ్రామాలను మండల కేంద్రంతో కలపడానికి కొన్ని రహదార్ల నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయి. అయినప్పటికీ మండలంలో కొన్ని సమస్యలు ఇంకా తీరడం లేదు.

విద్య, వైద్యం మెరుగుపడాలి

నూతనంగా ఏర్పడిన మండలంలో వైద్య పరంగా మెరుగైన సౌకర్యాలు కరువయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో పోలీస్ స్టేషన్ కొనసాగుతుండడంతో ఆరోగ్య సేవలందించడానికి మెరుగైన వసతులు కరువయ్యాయి. పలు గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో ప్రతీ ఏడాది చాలా మంది విద్యార్థులు ఎస్సెస్సీ పూర్తి చేస్తున్నారు. ఉన్నత విద్యా కోసం మండలంలోనే ఇంటర్ కళాశాల నిర్మించాలని చాలాకాలంగా మండలవాసులు కోరుతున్నారు.

శాశ్వత భవనాలు కరువు..

మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు నేటికీ శాశ్వత భవనాలు లేవు. పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలు కొంతకాలం అద్దె భవనాల్లో కొనసాగి తరువాత ఇతర శాఖల ప్రభుత్వ భవనాల్లో మారాయి. పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కొంతకాలం క్రితం గ్రామంలో 257 సర్వే నెంబర్‌లో స్థలాన్ని చదును చేయగా అది తమ పట్టా భూమి అని గ్రామానికే చెందిన కొందురు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణం ఆగిపోయింది.

అసంపూర్తిగా భగీరథ పనులు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన పనులు అనేక గ్రామాల్లో అసంపూర్తి దశలోనే ఉన్నాయి. పలు గ్రామాల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. అలాగే స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం లోపించడంతో అభివృద్ధి పనుల నిమిత్తం తవ్వకాలు జరిపేటప్పుడు పలు చోట్ల లీకేజీలు ఏర్పడుతున్నాయి. తర్వాత వీటికి మరమ్మతులు ఆలస్యం అవుతుండడంతో లీకేజీలు వలన నీటి వృథా జరుగుతోంది.

దృష్టి సారించాల్సిన మరికొన్ని అభివృద్ధి పనులు

రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చడానికి లాభనష్టాలతో సంబంధం లేకుండా అదనంగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించాలి.

- కొన్ని గ్రామాల్లో హరితహారంపై శ్రద్ధ చూపడం లేదు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలి.
- పలు గ్రామాలలో పశువుల తాగునీటి కోసం నీటితొట్టిలు నిర్మించాలి.
- ఆయకట్టు చివరి గ్రామాలకు సాగునీరందడం ప్రతీ ఏడాది సమస్యగానే మారుతోంది.దీనిని శాశ్వతంగా నివారించే చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి



నూతనంగా ఏర్పడిన మండలంలో ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించలేదు. దీంతో అధికారులు,ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

–నక్క చంద్రమౌళి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

స్థలాలు గుర్తించి కేటాయించాం



మండల కేంద్రంలో నిర్మించతలపెట్టిన ప్రభుత్వ కార్యాలయాల భవనాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులకు అప్పగించాం. పనుల ప్రారంభానికి శంకుస్థాపన కూడా చేశారు. త్వరలోనే పనుల్లో వేగం పుంజుకునే అవకాశం ఉంది.

– మాజిద్, తహసీల్దార్,బుగ్గారం

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ప్రమాదబీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ప్రమాదబీమా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు.జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన అంతడుపుల నవీన్, జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన పూదరి శంకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైన ప్రమాదబీమా చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకుని కాపాడుతుందన్నారు. రాష్ట్రంలో 60లక్షల సభ్యత్వంతో అతిపెద్ద పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, రూరల్ ఎంపీపీ మహేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్ రావు, మాజీ సర్పంచ్ న్యాడెం రత్నమాల, శంకర్, నీరటి గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'కరీంనగర్ కదనభేరి' విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల: కరీంనగర్ కదనభేరి సభకు వేలాదిమంది తరలివచ్చి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఫంక్షన్‌లో శనివారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, మాజీ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, పాక్స్ చైర్మన్లు ముత్యాల రాంలింగారెడ్డి, సాగర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టరాజేశ్వరస్వామికి ఊరేగింపు సేవ


తుంగూర్‌లో స్వామివారికి ఊరేగింపు సేవలో భక్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గుట్టరాజేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి, అమ్మవారికి ఊరేగింపు సేవ నిర్వహించారు. మహాశివరాత్రి రోజున స్వామివారి కల్యాణం జరిపారు. శనివారం స్వామివారు, అమ్మవారిని కొండ కిందికి సాయంత్రం పల్లకిలో మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి గ్రామంలో ఊరేగించారు. అర్చకులు చేసిన వీరభద్రుడి కత్తి విన్యాసాలు భక్తులను ఆలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ గుడిసె శ్రీమతి , భక్తులు పాల్గొన్నారు.

పొలస్తేశ్వరస్వామి ఆలయంలో పల్లకీసేవ


స్వామివారి పల్లకిసేవలో భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస పొలస్తేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో అనంతుల వేణుగోపాల్, ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్, రాజేంద్రకుమార్, మమత, రవి, గంగరాజం పాల్గొన్నారు.

వైభవంగా కనకసోమేశ్వర స్వామి జాతర


కోటేశ్వర స్వామి దర్శనానికి భక్తుల బారులు

మల్లాపూర్: మండల కేంద్రంలో శ్రీ కనక సోమేశ్వర స్వామి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం దంపతులతో ఆలయ ప్రధానార్చకులు ప్రభాకర్ శర్మ లింగోద్భవం ప్రత్యేక పూజలు నిర్వహించి, అఖండజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం శనివారం ఉదయం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారికి నిత్య పూజ, అభిషేకం, అన్నపూజలు నిర్వహించారు. జాతర మహోత్సవానికి తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై కిరణ్‌కుమార్ నేతృత్వంలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. జాతర మహోత్సవంలో ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మరిపెల్లి సత్తెమ్మ, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ కోటిలింగాల స్వామి జాతర..

మండలంలోని మొగిలిపేటలో శనివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కోటిలింగాల స్వామి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ముఖ్యఅతిథిగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏలేటి జలపతిరెడ్డి, ఎనడ్ల రాములు, గ్రామాధ్యక్షుడు గోల్కొండ రమేశ్ పాల్గొన్నారు.

జాతర్లలో భక్తజన సందడి ..

కథలాపూర్: మండలంలోని పోతారంలో లొంక రామన్న, భూషణరావుపేటలో శివాలయం, చింతకుంటలో తారకేశ్వరస్వామి, అంబారిపేటలో ఓంకారేశ్వరస్వామి జాతర ఉత్సవాలు శనివారం భక్తజన సందడిలో ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో లోక బాపురెడ్డి, ఎంపీటీసీలు కొండ ఆంజనేయులు, బొడ్డు బాలు, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవాలు


బుగ్గారంలో సాంబశివుని రథోత్సవం


రాయికల్‌లో రథం లాగుతున్న భక్తులు


రాపల్లెలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి/గొల్లపల్లి/రాయికల్/బుగ్గారం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో స్వామివారికి రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెగడపల్లి శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి, వెంగళాయిపేట శివాలయం, గొల్లపల్లి మండలం రాపల్లె, లొత్తునూర్ శ్రీరాజరాజేశ్వరా స్వామి ఆలయం, రాయికల్ పట్టణంలోని చెన్నకేశవ నాథ ఆలయం, బుగ్గారం సంతాన సాఫల్య శ్రీసాంబశివనాగేశ్వరుని ఆలయాల్లో రథోత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ మూర్తులను పల్లకి లో ఉంచి డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారులు, శివస్వాముల నృత్యాలు, శివ నామస్మరణముల మధ్య ప్రధాన వీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులకు ఆయా ఆలయాల్లో అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో ప్రభుత్వ విప్ పూజలు


విప్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కథలాపూర్: గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాలతో ప్రజల్లో స్నేహభావాలు పెంపొందుతాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చింతకుంట, అంబారిపేట, పోతారం, గంభీర్‌పూర్ గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఆయనకు గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెదలు సత్యనారాయణ, లోక నర్సారెడ్డి, ఖైర దేవ్‌యాదవ్, కట్ట శంకర్, గాజ ప్రభాకర్, బోదాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలకు...

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల, తొంబరావుపేట,మేడిపల్లి, వల్లంపల్లి, దమ్మన్నపేటలో జరిగిన శివరాత్రి జాతర ఉత్సవాలకు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు


మెట్‌పల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న స్వర్ణకారులు

మెట్‌పల్లి: పట్టణంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మరుసటి రోజు ప్రత్యేక రథంలో ఉత్సవ విగ్రహాలతో పుర వీధుల్లో శోభాయాత్ర జరిపారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సింహాద్రి, కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ఘనంగా కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు.

అలరించిన ఎడ్లబండ్ల పోటీలు

వెల్గటూర్: మండలంలోని వెంకటాపూర్‌ని శ్రీ కట్టరాజేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో గుల్లకోటకు చెందిన దావుల అరవింద్ మొదటి బహుమతిగా పావుతులం బంగారం, షేక్ అయాన్ రెండో బహుమతిగా 10 తులాల వెండి, మాదాసు వెంకటశివ, షేక్ బాష్మియా సంయుక్తంగా మూడో బహుమతిగా 8 తులాల వెండి గెలుచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాందేని కోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి


కోడెమొక్కులు తీర్చుకుంటున్న విప్

పెగడపల్లి: పెగడపల్లి రాజన్న ఆలయ అభివృద్ధికి దేవాదాయశాఖ నుంచి ప్రత్యేకంగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక శివాలయాన్ని శనివారం సందర్శించి శివరాత్రి ఉత్సవాల్లో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి కోడెమొక్కును చెల్లించుకున్నారు. అర్చకులు శ్రీనివాస్ శర్మ, వినయ్‌శర్మ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేసి కమిటీ తరుపున ఆయనను సన్మానించారు.

సాంబశివున్ని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ధర్మపురి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నేరెళ్ల సాంబశివ ఆలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ స్వామివార్లను దర్శించుకున్నారు. ఈసందర్భంగా దేవస్థానం వారు విప్‌ను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోరుట్ల: పట్టణానికి చెందిన ఇల్లెందుల గంగాధర్ అప్పుల బాధతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి శనివారం పట్టణ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో గంగాధర్ భార్య లత, పిల్లలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సేవాదళ్ ఇన్‌చార్జి బెజ్జారపు భూమాచారి, తదితరులు పాల్గొన్నారు.

తారకేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో తారకేశ్వరస్వామికి స్థానిక నాయకుడు కట్ట శంకర్- కవిత దంపతులు వెండి కిరీటం శనివారం బహుకరించారు. రూ. లక్ష విలువ గల వెండి కిరీటం తయారు చేయించి స్వామివారికి అలంకరించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామం నుంచి ఆలయం వరకు వెండి కిరీటంను డప్పుల చప్పుళ్లతో ఊరేగించి, ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో శనివారం 145 మందికి ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోమన్ మాట్లాడుతూ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జీ నిర్వహిస్తున్న హంగర్ రిలీఫ్ మిల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా కోరుట్లలో ఉచిత అల్పాహారం పంపిణీ 24వ రోజుకు చేరిందని పేర్కొన్నారు. ఉచిత భోజన పంపిణీకి కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఆర్సీ ఆడెపు మధు, డీసీ కమల, లయన్ మండలోజు రవీందర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడలో శనివారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను, బైపాస్‌రోడ్‌లో బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, బొలెరో వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు, వాహనాల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కోరుట్ల: పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మాడవేణి స్వప్న, కౌన్సిలర్ మాడవేణి నరేశ్, మాధురి, లత, సంధ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో మహాశివరాత్రి జాగరణ సందర్భంగా సంఘ మహేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జానపదాలు, మిమిక్రీ, ఫోక్ సాంగ్స్, భక్తి పాటలు ఆహుతులను అలరించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన ప్రత్యేక కార్యక్రమం ఆకట్టుకుంది.